క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

బంజారాహిల్స్: తెలంగాణ కార్మిక శాఖ గుర్తింపు పొందిన కార్మికుల కోసం ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఆరోగ్య పరీక్షల కోసం వచ్చే కార్మికులు తమ ఆధార్ కార్డును, లేబర్ గుర్తింపు కార్డును తీసుకొని రావాలన్నారు. అర్హులైన కార్మికులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు నం. 8885604218ను సంప్రదించవచ్చన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శనివారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును ప్రగతి భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే ఇక్కడ పేదల సౌలభ్యం కోసం...అనుమతించిన జీఓ 58 కోసం దరఖాస్తు సమయాన్ని పొడిగించాలని కోరగా..అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని దానం నాగేందర్ పేర్కొన్నారు.

31న దళిత హక్కుల పోరాట సమితి మహాసభ

లిబర్టీ: దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభ ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు మహాసభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శనివారం ఆయన సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 500 మందిపైగా ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. రాష్ట్రంలో, దేశంలో దళితుల ఎదుర్కొంటున్న సమస్యలు దళితులపై దాడులు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం అమలు, దళిత బంధు పథకం, దళితులకు మూడు ఎకరాల భూమి, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై జరుగుతున్న దాడులు వంటి అంశాలపై సభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ఖరారు చేస్తామని మార్టిన్ తెలిపారు. సమావేశంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

పేరుకే పెలికాన్ సిగ్నల్స్!

- పని చేయని బటన్స్
- రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్న పాదచారులు



పంజగుట్ట నిమ్స్ వద్ద పని చేయని బటన్



వాహనాల మధ్య ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న పాదచారులు

బంజారాహిల్స్: రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా పాదచారులు రోడ్డు దాటడం కష్టతరమవుతోంది. ముఖ్యంగా ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలు, ఆలయాలు, ప్రధాన కూడళ్లలో రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ముందుకు సాగాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే పాదచారులు తేలికగా రోడ్డు దాటేందుకు వీలుగా అత్యాధునిక సౌకర్యాలతో పలుచోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. అయితే ఇవి నామ మాత్రంగా మారడంతో లక్ష్యానికి అనుగుణంగా పాదచారులకు అందుబాటులో ఉండటం లేదు.

- పంజగుట్ట ప్రధాన రహదారిలో నిమ్స్ వద్ద ప్రతిరోజూ వేలాది మంది రోడ్డు దాటుతుంటారు. ఇక్కడి బిజీ రోడ్డులో వేగంగా వెళ్లే వాహనాల నడుమ రోడ్డు దాటాలంటే తీవ్ర భయాందోళనకు గురికావాల్సి వస్తోంది.
- ఈ నేపథ్యంలోనే ఇక్కడ పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఎవరైనా రోడ్డు దాటాలనుకుంటే ఇక్కడ ఏర్పాటు చేసిన బటన్ నొక్కితే పెలికాన్ సిగ్నల్స్‌లో రెడ్‌సిగ్నల్ వస్తుంది. అప్పుడు వాహనాలు ఆగిపోతాయి. ఆ సమయంలోనే పాదచారులు రోడ్డు దాటవచ్చు. ఇందుకోసం కొంత సమయాన్ని కేటాయించారు. అయితే ఎంతో ఉపయోగకరమైన ఈ పథకం సాంకేతిక లోపాల వల్ల నీరుగారిపోతున్నది.
- ఖైరతాబాద్ ప్రధాన రహదారిలో షాదన్ కాలేజీ వద్ద కూడా ఇలాంటి పెలికాన్ సిగ్నల్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇదొక్కటే అందుబాటులో ఉంది.
- ఇక్కడ షాదన్ కాలేజీతో పాటు పాఠశాలలు, డిగ్రీ కళాశాల ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇక్కడ సిగ్నల్ ఏర్పాటు చేశారు. మీట నొక్కి రోడ్డు దాటేందుకు వీలుగా బటన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. పదేపదే విద్యార్థులు రోడ్డు దాటుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో అందరూ ఒకేసారి రోడ్డు దాటేలా ఈ పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు.
- పాదచారులు ఎంతో సులువుగా రోడ్డు దాటేందుకు ఉపయుక్తంగా ఉన్న ఈ పెలికాన్ సిస్టమ్ ప్రస్తుతం ఒకట్రెండు చోట్ల మాత్రమే పని చేస్తుండగా చాలా చోట్ల పని చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- నగరంలో గుర్తించిన 50 చోట్ల ఈ పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు రూపొందించారు. షాదన్ కాలేజీ వద్ద ఈ విధానం విజయవంతం కాగా నిమ్స్ వద్ద మాత్రం పట్టుమని పది రోజులు కూడా పని చేయలేదు.
- ఫలితంగా మిగతా చోట్ల ఏర్పాటు చేయాలా వద్ద అనేదానిపై ట్రాఫిక్ పోలీసులు సందేహంలో పడ్డారు.
- వాహనదారులు, పాదచారులు మాత్రం మీట నొక్కి రోడ్డుదాటే ఈ విధానాన్ని స్వాగతిస్తుండగా సాంకేతిక లోపాలతో ఇవి పని చేయకుండా పోతున్నాయని సంబంధిత అధికారులు వాపోతున్నారు.
- పెద్దమ్మ ఆలయం వద్ద కూడా ఇటీవల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడ మీట నొక్కి రోడ్డు దాటే పరికరం చాలా అవసరం కాగా సంబంధిత అధికారులు ఇలాంటి చోట్ల దృష్టి సారించడం లేదు.

ఇలా పని చేస్తాయి

- పెలికాన్ సిస్టమ్‌తో ట్రాఫిక్ పోలీసులు అవసరం లేకుండానే పాదచారులే ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బటన్‌ను నొక్కగానే ఈ సిగ్నల్స్‌లో ఆరెంజ్ లైట్ అనంతరం గ్రీన్ లైట్ వెలుగుతుంది. అప్పటి వరకు గ్రీన్‌గా ఉన్న సిగ్నల్ రెడ్‌గా మారుతుంది.
- పాదచారులు రోడ్డు దాటేందుకు వీలుగా ఈ గ్రీన్‌లైట్ 15 సెకన్ల పాటు వెలుగుతూ ఉంటుంది. ఈ సమయంలో పాదచారులు రోడ్డు దాటగానే దానంతట అదే సిగ్నల్ గ్రీన్ వైపు వెళ్తుంది. దీంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళ్లే విధంగా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చారు.

పార్టీని మరింత బలోపేతం చేయండి



రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్రలో పాల్గొన్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలం పుంజుకుంటున్నదని, నేతలు ఇంటింటి ప్రచారంలో ముమ్మరంగా పార్టీ సిద్ధాంతాలను, రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొనియాడారు. రేవంత్‌రెడ్డి మానకొండూరులో చేస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్రలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్‌లో హాత్‌సే హాత్ పాదయాత్ర విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఒకవైపు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, ఇంకోవైపు ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా రోహిణ్‌రెడ్డి ప్రతిరోజూ నియోజక వర్గ నలుమూలలా పర్యటిస్తూ పేదలను కలుసుకుంటూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. ఇలాగే ప్రజల్లో తిరుగుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయనీయొద్దు



మాట్లాడుతున్న ఫేకోమత్ క్యాంపెయిన్ ప్రతినిధి మేధ

బంజారాహిల్స్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయిలో చెత్త సేకరించే ఆటో, రిక్షా కార్మికులదేనని ఫేకోమత్ క్యాంపెయిన్ ప్రతినిధి మేధ అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సీఎంటీసీ భవనంలో ఆటో, రిక్షా చెత్త సేకరించే కార్మికులు, శానిటేషన్ సూపర్‌వైజర్లకు స్వచ్ఛ సేన సర్కిల్ లెవల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఆయా కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్–18 డీఎంసీ రజినీ కాంత్‌రెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ, శివానంద్, ఖయ్యుం, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హోండా న్యూ సిటీ ఈ కార్



లక్డీకాపూల్: హోండా కార్స్ ఇప్పుడు న్యూ సిటీ (పెట్రోల్), న్యూ సిటీ ఈ కార్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. సేఫ్ డ్రైవింగ్‌కు అనుకూలంగానే కాకుండా అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెంట్ సిస్టమ్ సదుపాయంతో ఈ కార్ వచ్చిందని హోండా కార్ సీఈఓ టకుయా సుమురా తెలిపారు. అంతే కాకుండా పలు సరికొత్త ఫీచర్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. హోండా కార్ ప్రియులకు ఈ న్యూ సిటీ కారు ఎంతో ఆకట్టుకుంటుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

శ్రీనగర్‌కాలనీ: మహిళలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ జనప్రియ ఒవైసీ గ్రౌండ్స్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, బీఆర్‌ఎస్ మహిళాభివృద్ధికి చేసిన పనులను వివరించారు. పలువురు మహిళలు, మహిళా కానిస్టేబుళ్లను సత్కరించి కానుకలను అందించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ డి. సంజీవ, సెక్రటరీ షరీఫ్ ఖురేషి, పల్లవియాదవ్, కల్యాణి, గంట మల్లేష్ పాల్గొన్నారు.



మహిళా కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బంజారాహిల్స్: సామాన్య మధ్య తరగతి ప్రజలు తమ ఆడపిల్లల వివాహాలను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకాల కింద మంజూరైన చెక్కులను స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి పంపిణీ చేశారు. దేశంలోనే ఇలాంటి బృహత్తర పథకం అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. పేద ప్రజలకు కేసీఆర్ పెద్ద దిక్కుగా ఉంటున్నారన్నారు.

వీధి కుక్కల నియంత్రణ కమిటీ సభ్యుడిగా సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: జీహెచ్ఎంసీ వీధి కుక్కల నియంత్రణ ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడిగా రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో కుక్కల నియంత్రణ, జనం కుక్క కాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన చర్యపై ఈ కమిటీ చర్చించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని సీఎన్ రెడ్డి తెలిపారు.

ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో రాణించిన క్రీడాకారులు

సాక్షి,సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా నిర్వహిస్తున్న 13వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ (లింగమనేని లక్ష్మీ మెమోరియల్ కప్) లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. 13వ హెచ్ఓటీఏ టోర్నీలో దేశవ్యాప్తంగా 390 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఇందులో భాగంగా మెన్స్ సింగిల్స్ (30)లో అంకేష్ భార్గవ్-సాయినాథ్ 8-0, ఈశ్వర్ సాయి-జయేష్ 8-3, మెన్స్ సింగిల్స్ (40)లో బోస్ కిరణ్-చంద్రశేఖర్ 8-3, అశ్విన్ కుమార్-జహంగీర్ 8-3 మెన్స్ సింగిల్స్ (50)లో నీలకంఠ్-సుధాకర్ 8-1 మెన్స్ సింగిల్స్ (60)లో మెహర్‌ప్రకాష్-సత్య 8-0 మెన్స్‌సింగిల్స్ (70)లో గజపతి-క్రిష్ణ కుమార్ 8-4 ఉమెన్స్ సింగిల్స్‌లో సౌమ్య నాయుడు-ప్రాణహిత 8-0, గాయత్రి-ప్రశాంతిలు 8-2తో రాణించారు. డబుల్స్‌లో జానకి-ఉన్నతి, సౌమ్య నాయుడు-నీలిమ అగర్వాల్‌లు రాణించారు.

'బలగం' కథ నాదే..

పంజగుట్ట: దిల్ రాజు కుమార్తె నిర్మించిన బలగం సినిమా కథ తనదేనని, అయితే తన అనుమతి తీసుకోకుండానే తాను రాసిన కథతో సినిమా తీశారని, టైటిల్స్‌లో కనీసం తన పేరు కూడా వేయలేదని పాత్రికేయుడు గడ్డం సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తన తాత మరణాంతరం జరిగిన కార్యక్రమాల ఆధారంగా తాను 2011లో కథ రాసుకున్నానని, అది 2014 డిసెంబర్ 14న ఓ తెలుగు దినపత్రికలో'పచ్చికి..' పేరుతో ప్రచురితమైందన్నారు. కాగా ఇటీవల వచ్చిన బలగం చిత్రం తెలంగాణ యాసలో వచ్చిందని తెలిసి, రివ్యూ రాద్దామనే ఆలోచనతో ప్రీమియం షోకు వెళ్లగా సినిమా మొత్తం తన పచ్చికి కథే ఉండటం చూసి ఆశ్చర్యం వేసిందన్నారు.

కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి



బంజారాహిల్స్: వీధి కుక్కల పట్ల పాఠశాల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని ఎంటమాలజీ అధికారులు సూచించారు. వీధి కుక్కలపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో భాగంగా శనివారం బంజారాహిల్స్ రోడ్ నం. 12 ఎన్బీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీధి కుక్కల నుంచి రక్షణ పొందే విధానాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.


బీఆర్ఎస్ ప్రజలను మోసం చేస్తోంది: బీజేపీ



నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఇచ్చిన హామీలను మరిచి, మాటల గారడీతో బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ నేతలు దుయ్యబట్టారు. శనివారం యూసుఫ్‌గూడ బస్తీలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ సీనియర్ నేత కుంబాల గంగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని, ప్రజా సమస్యలను మరిచిందని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు కృష్ణగౌడ్, లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ పద్మ వీరపనేని, ప్రేమ్‌కుమార్, బంగారు ప్రశాంత్, విజయ్ పాల్గొన్నారు.

'కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్' ఉపాధ్యక్షుడిగా సింహం



బంజారాహిల్స్: ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉపాధ్యక్షుడిగా బంజారాహిల్స్ ఇందిరానగర్ బస్తీ నేత ధాత్రిక సింహం నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సురేష్‌కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ప్రజల హక్కుల పరిరక్షణ, అవినీతి లేని సమాజం కోసం ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్ సంస్థ పని చేస్తోందని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా సింహం తెలిపారు.

భర్తను శిక్షించాలని మృతురాలి బంధువుల ఆందోళన



కార్తీక మృతదేహం వద్ద బైఠాయించిన బంధువులు

పంజగుట్ట: అనుమానాస్పద స్థితిలో శుక్రవారం మృతి చెందిన వివాహిత కార్తీక మృతదేహం వద్ద ఆమె పుట్టింటి తరపు బంధువులు శనివారం ఆందోళన నిర్వహించారు. కార్తీక మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్ మక్తాలోని కార్తీక భర్త జగదీష్ కామ్లేకర్ ఇంటికి మధ్యాహ్నం చేరుకున్న మృతురాలి సోదరుడు, ఇతర బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతడిని చితకబాదారు. పెళ్లి సమయంలో ఇచ్చిన కానుకలతో పాటు కాచిగూడలోని ఇల్లు, ఎంఎస్ మక్తాలోని ఇల్లు తిరిగి తమకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని సముదాయించి అంతిమ సంస్కారాలు చేయించారు. ఇదిలా ఉండగా, కార్తీక సోదరుడు విక్రమ్ రాజ్ మాట్లాడుతూ .. 2006 ఫిబ్రవరి 1వ తేదీన తన మేనత్త కొడుకైన జగదీష్‌కు సోదరి కార్తీకను ఇచ్చి పెళ్లి జరిపించారని చెప్పాడు. పెళ్లైనప్పటి నుంచి తన సోదరికి అత్తింటి వేధింపులు మొదలయ్యాయని అన్నారు. గత 17 ఏళ్లలో ఒక్కసారి కూడా కార్తీకను తమ ఇంటికి పంపలేదన్నారు. గత నెల 27న వేరేవారితో ఫోన్ చేయించి మీ సోదరికి చాలా సీరియస్‌గా ఉందని, డెక్కన్ ఆసుపత్రిలో ఉందని చెప్పారన్నారు. ఆసుపత్రి వైద్యులను ఆరా తీస్తే ఛాతీపై దాడి చేసినట్లు ఉందని చెప్పారన్నారు. తన సోదరి మృతికి కారణమైన భర్త జగదీష్, ఇతర కుటుంబసభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాడు.

అమ్మ ప్రేమ ఎంతో గొప్పది



పాల్గొన్న మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్

లిబర్టీ: సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ అన్నారు. శనివారం లిబర్టీ ప్లాజా వద్ద ఉన్న మాతృదేవోభవ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మ ప్రేమ ఎంతో గొప్పదని, కుటుంబ వ్యవస్థలో అమ్మ నిర్వహిస్తున్న పాత్ర అమోఘమని గుర్తు చేశారు. నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో అనేక సమస్యలు వస్తుండటంతో కుటుంబ వ్యవస్థ చీలిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ వ్యవస్థ గొప్పదని అందు లో కుటుంబ వ్యవస్థకు మంచి పేరు ఉందన్నారు. కుటుంబ వ్యవస్థ కలకాలం ఉండేలా మానవాళిలో నైతిక విలువలు, మానవత విలువలు పెంపొందించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు: ఏసీపీ

రహమత్‌నగర్: మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనాల తనిఖీల్లో మైనర్లు పట్టుబడితే పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులను సైతం బాధ్యులు చేస్తామని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు స్పష్టం చేశారు. శ్రీరాంనగర్ విస్‌డమ్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. రహదారులు దాటేటప్పుడు జీబ్రాలైన్స్‌లోనే దాటాలని విద్యార్థులకు ఏసీపీ సూచించారు. స్కూల్ వాహనాల డ్రైవర్లు తాగి డ్రైవింగ్ చేస్తుంటే పోలీసులకు లేదా పాఠశాల యాజమాన్యానికి తెలియజేయాలని అన్నారు. ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్ఐలు విజయానందం, కాంతరావు, బేగంపేట టీటీఐ ఎస్సైజ్యోతి, హెచ్‌సీ పద్మావతి, వాహేద్, చిరంజీవి, విస్‌డమ్ స్కూల్ కరస్పాండెంట్ ఆగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో...

ఖైరతాబాద్: సైఫాబాద్‌లోని కమ్యూనిటీ సైన్స్ కళాశాలలోని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల వచ్చే అనర్థాలను తెలియజేశారు. అసోసియేట్ డీన్ డి.రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి.ప్రియ, ఎస్ఐ జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.



కమ్యూనిటీ సైన్స్ కళాశాల విద్యార్థులతో ఏసీపీ శంకర్‌రాజు తదితరులు